

వైద్యులకు భరోసా కల్పించాలి

సేవ చేసే వైద్యులకు భరోసా కల్పించాలి. పని ప్రదేశంలో తగిన రక్షణ చర్యలు ఉండాలి. ఇలాంటి ఘటనలు జరగకుండా కఠినమైన చట్టాలు అమలు చేయాలి. మహిళా వైద్యులపై ఇలాంటి దుశ్చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. వైద్యులు, నర్సులు ఎంతో సేవాభావంతో పనిచేస్తారు.
వారికి ప్రతీ ఒక్కరూ అండగా నిలవాలి. ఆడపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిని ఉరిశిక్ష వేసేలా చట్టాలు ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై తగిన చొరవ తీసుకోవాలి.

– డాక్టర్ కె.వి.ఎస్. గౌరీశ్వరరావు, రిటైర్డ్ డీఎంహెచ్‌వో

సేవ చేసే వారిని గౌరవించాలి



ఆరోగ్య సమస్యలపై ఆస్పత్రి వచ్చే ప్రతీ ఒక్కరికీ ఎంతో బాధ్యతగా వైద్య సేవలు అందిస్తాం. మాతో పాటు, నర్సింగ్ సిబ్బంది సేవాభావంతో పనిచేస్తారు. అలాంటి వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. వైద్యులు దేవుడితో సమానమంటారు. ప్రాణం నిలిపే వ్యక్తులను ప్రతీ ఒక్కరూ గౌరవించాలి. ఏదైనా జరిగిన తరువాత స్పందించే కంటే, కోల్‌కతా తరహా ఘటనలు జరగకుండా ముందుగానే తగిన చర్యలు తీసుకోవాలి. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై కఠిన శిక్ష పడేలా చట్టాలు ఉండాలి.

– డాక్టర్ రొంగలి రేవతి, బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ

క్లుప్తంగా

వినాయక ఉత్సవాలకు పందిరి రాట నేడు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్‌లో వినాయక చవితి ఉత్సవాల పందిరి రాట కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్నామని జియ్యాని విజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30గంటలకు శాస్త్రోక్తంగా వేడుక ఉంటుందని పేర్కొన్నారు. శాంతినగర్ యూత్ ఆధ్వర్యంలో ఏటా మాదిరి ఉత్సవాలను కోలాహలంగా జరిపించేలా కార్యాచరణ సిద్ధం చేశామని తెలియజేశారు.

వార్డుల్లో ఎమ్మెల్యే పర్యటన



వెంకటాపురంలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: జీవీఎంసీ 91, 92, 89 వార్డుల్లో ఎమ్మెల్యే గణబాబు మంగళవారం పర్యటించారు. రహదారులు, కాల్వలు, పైప్ లైన్ పనులు, అండర్ పాస్‌వే మార్గాల్లో నీరు నిల్వ ఉండిపోవడాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వెంకటాపురం నుంచి కొత్తపాలెం వెళ్లే రహదారి 5 మదుముల వద్ద రోడ్డు నిర్మాణంపై అధికారులతో మాట్లాడారు. చంద్రనగర్ నుంచి పాత గోపాలపట్నం వెళ్లేదారిలో పాత గోపాలపట్నం నుంచి బాజీ జంక్షన్ వెళ్లే అండర్ పాస్‌వేలో నీరు నిల్వ ఉండడంతో స్థానికులు, వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి చేపట్టవలసిన చర్యలపై ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ పర్యటనలో జీవీఎంసీ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల పని దినాల తగ్గింపు తగదు



స్టీల్‌ప్లాంట్‌లో విభాగాధిపతి కార్యాలయం వద్ద ధర్నాలో కార్మికులు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల పని దినాల తగ్గింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని స్టీల్ సీఐటీయూ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. యాజమాన్యం కార్మికుల పని దినాలు తగ్గింపుపై తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా మంగళవారం ప్లాంట్‌లోని పలు విభాగాల అధిపతుల కార్యాలయాల వద్ద ధర్నా చేశారు. ధర్నాలో నాయకులు మాట్లాడుతూ యాజమాన్యం ఉత్పత్తి పెంపు చర్యలు చేపట్టకుండా కాంట్రాక్ట్ కార్మికులను తొలగించే చర్యలకు పాల్పడుతోందన్నారు. బయోమెట్రిక్ లోపాలను సరిదిద్దకుండా కార్మికుల జీతాల్లో కోత విధిస్తామంటే అంగీకరించబోమన్నారు. కార్మికులను ఇబ్బందులకు గురి చేయడం ఆపకపోతే ఈ నెల 30న ఈడీ (వర్క్స్) బిల్డింగ్ ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో జి.శ్రీనివాసరావు, కె.ఎం.శ్రీనివాస్, ఓ.వి.రావు, నమ్మి రమణ, కె.పి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా గరుడసేవ



గరుడసేవలో అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవ విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఆలయ కల్యాణ మండపంలో వెండి గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేష హారతులిచ్చారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందించారు.

మందుబాబుల అడ్డాగా ఎన్‌ఏడీ సెంటర్

- కూడలి చుట్టూ విచ్చలవిడిగా బెల్ట్ షాపులు
- కాలేజీలను ఆనుకుని మద్యం విక్రయాలు
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



కాలేజీ గేటుకు ఎదురుగా మద్యం సీసాలు



నారాయణ కాలేజీకి వెళ్లే దారిలో బెల్ట్ షాపులు



ఫ్లై ఓవర్ కింద మద్యం సీసా

విశాఖ విద్య: ఎన్‌ఏడీ సెంటర్ మందుబాబులకు అడ్డాగా మారింది. చీకటి పడితే చాలు, ఫ్లై ఓవర్ కింద సిట్టింగ్ వేస్తున్నారు. మద్యం మత్తులో వారు చేస్తున్న వెకిలి చేష్టలతో ఆ దారుల్లో ప్రయాణం చేసేవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సాయంత్రం మొదలుకుని రాత్రి 11 గంటల వరకు ఇక్కడ ఇదే తంతు సాగుతున్నా సంబంధిత శాఖల అధికారులు ఎవరూ ఇటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. అటు గాజువాక, ఇటు మర్రిపాలెం మరోవైపు బిర్లా జంక్షన్‌కు వివిధ పనుల కోసం రాకపోకలు సాగించేవారంతా రోజూ సాయంత్రం వేళల్లో ఎన్‌ఏడీ సెంటర్ మీదుగానే ఇళ్లకు చేరుకోవాలి. ఎన్‌ఏడీ చుట్టూ ఉన్న స్కూళ్లు, కాలేజీలకు వచ్చిపోయే విద్యార్థులు కూడా తిరుగు ప్రయాణంలో బస్సుల కోసం ఇక్కడే వేచి ఉండాలి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న సెంటర్‌లో బహిరంగ ప్రదేశంలో గ్లాసుల్లో మద్యం సేవిస్తుండటంతో అటుగా వెళ్లే పాదచారులు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

బెల్ట్ షాపులకు అడ్డుకట్ట ఏదీ?

ఎన్‌ఏడీ సెంటర్‌లో ప్రభుత్వ మద్యం దుకాణాలతో పాటు, లైసెన్స్‌డ్ బార్లు కూడా ఉన్నాయి. అయినప్పటికీ ఫ్లై ఓవర్ చుట్టూ చిన్న చిన్న పాన్ షాపుల్లో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. లైసెన్స్‌డ్ దుకాణాలకు అనుబంధంగానే వీటిని నిర్వహిస్తుండటంతో వాళ్లు కూడా ఇలాంటివాటిని పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే దారిలో కూడా పాన్ షాపుల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఫ్లైఓవర్ సమీపంలో నారాయణ జూనియర్ కాలేజీ బాలికల క్యాంపస్ ఉంది. ఇదేదారిలో మరో రెండు జూనియర్ కాలేజీలు ఉండగా, ఇక్కడే మందు బాబులు మద్యం తాగుతున్నారు. తాగిన సీసాలు కూడా రోడ్డుపై పడేస్తున్నారు. ప్రతీ రోజూ కాలేజీకి వచ్చే విద్యార్థినులు వాటిని దాటుకునే లోపలికి వెళ్లాల్సిన దుస్థితి.

పారిశుధ్య కార్మికులకు తప్పని ఇబ్బందులు

పరిసరాల పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకం. ఎన్‌ఏడీ ఏరియాను సుందరంగా తీర్చిదిద్దేందుకు వారు ఎంతో శ్రమిస్తారు. కానీ ఫ్లై ఓవర్ కింద మందుబాబులు తాగేసి పడేస్తున్న సీసాలు, వ్యర్థాలను తొలగించడం పారిశుధ్య కార్మికులకు అదనపు భారం అవుతోంది. మద్యం మత్తులో కొంతమంది సీసాలను పగలగొట్టి దారుల్లో, మురుగు కాలవల్లో వేస్తున్నారు. వీటిని తీసేందుకు పారిశుధ్య కార్మికులు నానా ఇబ్బంది పడుతున్నారు. కొన్నిసార్లు వారి చేతులకు గాయాలు సైతం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్‌ఏడీ సెంటర్ ప్రాధాన్యత దృష్ట్యా ఎక్సైజ్, పోలీస్ అధికారులు సమన్వయతో పనిచేసి ఫ్లై ఓవర్ కింద జరుగుతున్న ఇటువంటి అనైతిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

కూటమి నేతల కనుసన్నల్లోనే..

ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ చుట్టుపక్కలే కాకుండా, నియోజకవర్గంలోని పలు చోట్ల బెల్ట్ షాపులు దర్జాగా నిర్వహిస్తున్నారు. వినాయక చవితి, దసరా ఉత్సవాలు ముందు ఉండటంతో కూటమి నేతల కనుసన్నల్లోనూ వీటిని నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. బెల్ట్ షాపు ఒక ధర, సిట్టింగ్ ఉంటే మరో ధర నిర్ణయిస్తూ టీడీపీకి చెందిన కొంతమంది నాయకులు వసూళ్లకు పాల్పడుతున్నారనే ప్రచారం సాగుతోంది. ఎక్సైజ్ శాఖ వారు ఇప్పటికైనా స్పందించాలని పలువురు కోరుతున్నారు.

ఆడపిల్లలు భయభయంగా వెళ్తున్నారు

మా అమ్మాయి ఎన్‌ఏడీ బాజీ జంక్షన్‌లోని కాలేజీలో ఇంటర్ చదువుతోంది. కాలేజీకి దగ్గరలోనే మద్యం అమ్ముతుండటం వల్ల, అక్కడ తాగుతూ ఊగుతుండటంతో ఆడపిల్లలు తలవంచుకుని భయంభయంగా వెళ్తున్నారు. అమ్మాయిని ఒక్కదాన్నే పంపలేక కాలేజీకి రోజూ రక్షణ ఇచ్చి పంపించాల్సి వస్తోంది. దీనిపై అధికారులు పట్టించుకోవాలి. కాలేజీలకు దగ్గరలో ఇలాంటి వాటిని కట్టడి చేయాలి.

– కె.వెంకటలక్ష్మి, గోపాలపట్నం

విద్యాలయాల వద్ద దుకాణాలు తొలగించాలి

విద్యాలయాల వద్ద మత్తు పదార్థాలు అమ్మకూడదు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కొంతకాలంగా ఇలాంటి వాటిపై ఎంతో చైతన్యం తీసుకొస్తోంది. అయినా, విద్యాలయాల వద్ద మత్తు పదార్థాలు, బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మకాలు చేస్తున్నారు. ఆడపిల్లలు కాలేజీలకు భయం భయంగా వెళ్తున్నారు. మందు తాగిన వారు చేసే చేష్టలతో ఇబ్బంది పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి, విద్యాలయాల వద్ద దుకాణాలు తొలగించాలి.

– ఎస్.రామలక్ష్మి, స్వచ్ఛందసంస్థ నిర్వాహకురాలు, బుచ్చిరాజుపాలెం

ప్రధానోపాధ్యాయులకు శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో త్రినాథరావు

మల్కాపురం: బాలల హక్కులపై ప్రధానోపాధ్యాయులకు ఎంఈవోలు అవగాహన కల్పించారు. జీవీఎంసీ 61వ వార్డు వెంకన్నపాలెంలో విజ్ఞాన్ హైస్కూల్ వద్ద మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ములగాడ మండల పరిధిలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవోలు డి.వి.త్రినాథరావు, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, చిన్నారులు చెడు అలవాట్లకు గురి కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలను వివరించారు. పిల్లలను సెల్‌ఫోన్, వీడియో గేమ్స్ నుంచి తప్పించి, చదువుపై దృష్టి మళ్లించే విధంగా కౌన్సెలింగ్ నిర్వహించడం, బాగా చదువుకుంటే భవిష్యత్తు ఎలా ఉంటుంది తదితర అంశాలను విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ పార్వతి పాల్గొన్నారు.

రక్షణగోడ పునర్నిర్మాణ పనుల పరిశీలన

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలో రక్షణ గోడ పునర్నిర్మాణ పనులను ట్రేడ్ యూనియన్ నాయకుడు పుర్రె సురేష్ యాదవ్ మంగళవారం పరిశీలించారు. వార్డులోని 331, 332 సచివాలయాల పరిధిలోని ప్రాంతంలో గల రక్షణ గోడ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూలిపోయింది. దీంతో కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ యాదవ్ ఎమ్మెల్యే పి.గణబాబు దృష్టికి సమస్య తీసుకువెళ్లడంతో ఆయన జీవీఎంసీ అధికారులతో మాట్లాడి పునర్నిర్మాణ పనులకు ఆదేశించారు. ఆ పనులను సురేష్ యాదవ్ ఇంజినీరింగ్ వర్క్స్ అధికారులతో కలిసి పరిశీలించారు.

చిన్ని కృష్ణులు.. చిన్నారి గోపికలు

వేషధారణల్లో ఆకట్టుకున్న బాలబాలికలు



చిన్నికృష్ణులు, గోపికల వేషధారణలో ఉన్న చిన్నారులతో బ్రహ్మకుమారీలు

మల్కాపురం: కృష్ణాష్టమి వేడుకలను ప్రజాపిత బ్రహ్మకుమారి సంస్థ శ్రీహరిపురం బ్రాంచ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. 60వ వార్డు జవహర్ నగర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా శ్రీ కృష్ణుడికి సంస్థ నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంస్థ సభ్యుల పిల్లలు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణల్లో అలరించారు. భక్తిగీతాలకు నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. శ్రీకృష్ణుడు భగవద్గీత ద్వారా తెలిపిన బోధనలను ఆహూతులకు బ్రహ్మకుమారీలు వివరించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం, సంస్థ నిర్వాహకురాలు సింధు తదితరులు ప్రసంగించారు.

అప్రమత్తతతో నేరాల నియంత్రణ



అపార్ట్‌మెంట్‌వాసులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాసరావు

గోపాలపట్నం: అప్రమత్తతతో నేరాలను నియంత్రించగలమని వెస్ట్ సబ్ డివిజన్ సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావు అన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా చోరీలకు చెక్ చెప్పవచ్చన్నారు. నేరాల నియంత్రణపై ఎన్‌ఏడీ జంక్షన్‌లోని వాసవి ప్యారడైజ్ అపార్ట్‌మెంట్‌లో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి చోరీలకు పాల్పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. చైన్ స్నాచింగ్ జరగకుండా మహిళలు జాగ్రత్త వహించాలన్నారు. సైబర్ నేరాలు పెరుగుతున్నందున అవగాహనతో ఉండాలని సూచించారు. అత్యాశకు పోతే ఉన్నది కూడా పోగొట్టుకునే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో క్రైం పోలీసులు, అపార్ట్‌మెంట్‌వాసులు పాల్గొన్నారు.

31న ఈపీఎస్ - 95 పెన్షనర్ల అసోసియేషన్ సమావేశం

ఉక్కునగరం : ఈపీఎస్ – 95 పెన్షనర్ల అసోసియేషన్ రెండో వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం) ఈ నెల 31న నిర్వహించనున్నారు. ఉక్కు అధికారుల సంఘం (సీ) భవన్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి అసోసియేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.రాజశేఖర్ అధ్యక్షత వహించనున్నారు. జాతీయ గౌరవ అధ్యక్షుడు మంత్రి రాజశేఖర్, వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నట్టు జాతీయ ఉపాధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు తెలిపారు. ఈపీఎస్ – 95 పెన్షనర్లు అందరూ సమావేశంలో పాల్గొనాలని ఆయన కోరారు.

మానవ మృగాలకు ఉరే సరి



అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న పలు సంఘాల నాయకులు

గోపాలపట్నం: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై ఘాతుకానికి పాల్పడిన మానవ మృగాలను ఉరి తీయాలని ప్రజా సంఘాల ప్రతినిధులు, హెల్త్ వలంటీర్లు డిమాండ్ చేశారు. 91వ వార్డు లక్ష్మీనగర్ ఈ–బ్లాక్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మృతురాలికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా విదసం ఐక్యవేదిక కో–కన్వీనర్ సోడదాసి సుధాకర్ మాట్లాడుతూ జూనియర్ వైద్యురాలిపై జరిగిన ఘటన దారుణమని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. దోషులు ఎంతటి వారైనా ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేశారు. రైల్వే యూనియన్ నాయకుడు డెంకాడ ఆనంద్ మాట్లాడుతూ జూనియర్ డాక్టర్ల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలన్నారు. హెల్త్ వలంటీర్ అనూష మాట్లాడుతూ ప్రాణాలను నిలబెట్టే వారిపై మృగాల్లా ప్రవర్తించడం దుర్మార్గమన్నారు. ఇలాంటి వారు సభ్య సమాజంలో బతికే అర్హత కోల్పోయారన్నారు. అలాంటి వారిని రక్షించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే సమాజాన్ని ప్రమాదకర పరిస్థితిలోకి నెట్టేయడమే అవుతుందన్నారు. ఇటువంటి చర్యలను ముక్తకంఠంతో వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు బండారు తులసీరామ్, కె.సంజీవరావు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ చర్యలతో టీచర్లపై అదనపు భారం

యూటీఎఫ్



డిప్యూటీ డీఈవో సువర్ణకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

విశాఖ విద్య: ఉపాధ్యాయులకు బోధనేతర పనులను పూర్తిగా మినహాయించి.. కేవలం బోధనకు మాత్రమే పరిమితం చేయాలని యూటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం డిప్యూటీ డీఈవో సువర్ణకు జిల్లా ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. మరుగుదొడ్ల ఫొటోల బాధ్యత నుంచి తప్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తే సంతోషించామని, కానీ ప్రస్తుత చర్యలు మరింత భారం పెంచేలా ఉన్నాయన్నారు. ఎస్ఎంసీ సభ్యులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు మరుగుదొడ్ల ఫొటోలు తీయకపోతే అందుకు హెచ్ఎంలు బాధ్యత వహించాలనడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రతిరోజూ సాయంత్రం మూడు గంటల నుంచి మూడున్నరలోపు పది అంశాలతో కూడిన గూగుల్ ఫాం పూర్తి చేసి హెచ్ఎంలు అప్‌లోడ్ చేయాలని చెప్పడం అదనపు భారమేన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టీఆర్ అంబేడ్కర్, నాయకులు కె.రాంబాబు, ఉప్పాడ రాము, రియాజ్ అహ్మద్, పెందుర్తి మండల అధ్యక్షుడు అప్పల రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నెలా ఒకటిన కార్మికులకు జీతాలు చెల్లించాలి



స్టీల్‌ప్లాంట్ సీజీఎం శ్రీధర్‌ను అభినందిస్తున్న యూనియన్ నాయకులు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ కార్మికులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని బీఎంఎస్, టీఎన్‌టీయూసీ, డీఎస్ఈయూ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్)గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన యు.శ్రీధర్‌ను మంగళవారం నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాంట్‌లో ఉన్న స్క్రాప్‌ను త్వరితగతిన ఉపయోగించి లాభం చేకూర్చాలన్నారు. ప్లాంట్ సమస్యలను తమకు తెలియజేస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. దీనిపై సీజీఎం మాట్లాడుతూ రెండు నెలల్లో ప్లాంట్‌కు మంచి పరిస్థితి వస్తుందని, అంత వరకు ఓపిక పట్టాలన్నారు. ప్లాంట్ పరిరక్షణకు తాము ఉమ్మడిగా సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గుమ్మడి నరేంద్ర, నమ్మి సింహాద్రి, కొమ్మినేని శ్రీనివాసరావు, రామస్వామి, పి.ఎస్.ఆర్.లక్ష్మణరావు, అట్ట అప్పారావు, మణికుమార్, లక్ష్మణ్, వియ్యపు చిన్న తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటం ఉధృతం చేస్తాం



మాట్లాడుతున్న ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ ఆదినారాయణ

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో మంగళవారం 1293వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కును కాపాడుకోవడానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలను చైతన్యవంతులను చేసి ప్రజా మద్దతు కూడగట్టి కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా చేస్తామన్నారు. ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని, తక్షణ సాయంగా రూ.5 వేల కోట్ల నిధులు విడుదల చేయాలని మొరపెట్టుకుంటున్నా కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. ప్రజాధనంతో నిర్మించిన విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలని చూడడం సబబుకాదన్నారు. కార్యక్రమంలో వరసాల శ్రీనివాసరావు, మసేనురావు, కె.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సింహగిరి కొండల్లో విత్తన బంతులు

సింహాచలం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, విత్తన బంతులతో పచ్చదనాన్ని పెంపొందించాలని కృష్ణా యూనివర్సిటీ విశ్రాంత ఉపకులపతి సుంకరి రామకృష్ణారావు సూచించారు. సింహగిరిపై లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దేవతా వృక్షాలు, ఔషధ గుణాలు కల్గిన మొక్కల విత్తనాలతో తయారుచేసిన విత్తన బంతులు జల్లే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పలు రకాల ఔషధాల మొక్కల విత్తనాలు, పేడ కలిపి తయారు చేసిన విత్తన బంతులను కొండల్లోకి విసిరారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ భవిష్యత్ తరాల వారికి పచ్చదనాన్ని అందించడం మనందరి బాధ్యత అన్నారు. కనుమరుగవుతున్న ఔషధ గుణాలున్న చెట్లను ఎక్కువగా భావితరాలకు అందించాలన్నారు. విత్తన బంతులను తయారుచేసి కొండల్లో వేయడం ద్వారా వర్షాలు పడినప్పుడు అవి తొందరగా భూమిలోకి చొచ్చుకుని, మొక్కలుగా ఎదుగుతాయన్నారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ ఏవీబీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ హిల్ ఎర్త్ నినాదంతో పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నార్త్ ఈస్ట్ లయన్స్ అధ్యక్షుడు ఎం.సురేష్, వనితా విభాగం ప్రతినిధి సీతారత్నం, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యులు వంకాయల సాయి నిర్మల, గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం పాల్గొన్నారు.

నేత్ర దానంపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న పీహెచ్‌సీ సిబ్బంది

పరవాడ: అన్ని దానాల్లో నేత్ర దానం గొప్పదని పరవాడ ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ హారిక అన్నారు. నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది పరవాడలో మంగళవారం నేత్రదాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ హారిక మాట్లాడుతూ ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 8 వరకు నేత్రదాన పక్షోత్సవాలను నిర్వహించి, నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు